క్లుప్తంగా

వైద్య పరికరాల వితరణ



దాతలను సత్కరిస్తున్న పీడియాట్రిక్ విభాగం వైద్యులు, సిబ్బంది

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో పీడియాట్రిక్స్ విభాగానికి పలు కీలక వైద్య పరికరాలు సమకూరాయి. రంగరాయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ వంక రామకృష్ణ, ఆయన అల్లుడు కుమార్తెలు డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ శ్రీ చంద్ర రూ.6 లక్షల విలువైన సీపాప్ మెషీన్, ఆటో అనలైజర్ చంటి పిల్లల విభాగానికి బహూకరించారు. రామకృష్ణ రెడ్ క్రాస్‌లో చంటిపిల్లల వైద్యుడు కాగా, జ్యోత్స్న, డాక్టర్ చంద్ర టెక్సాస్‌లో ప్రముఖ రేడియాలజిస్టులు. ఈ మేరకు ఆ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హెచ్‌వోడీ డాక్టర్ మాణిక్యాంబ అధ్యక్షతన శుక్రవారం ఆయా పరికరాలను అందజేశారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్, ఆంకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీనివాసన్ హాజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ వంక రామకృష్ణ మాట్లాడుతూ, తాను చదువుకున్న కళాశాల, వైద్యశాలలో ఉత్తమ వైద్య సేవలు అందించేందుకు తన వంతు సహకారం అందించడం, అందుకు తన అల్లుడు, కుమార్తె సహకరించడం ఆనందాన్నిచ్చిందన్నారు. డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ మాణిక్యాంబ మాట్లాడుతూ, డాక్టర్ వంకా రామకృష్ణ భావితరాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ డిపార్ట్‌మెంట్‌ను సమర్థనీయంగా తయారు చేసి పేద రోగులకు మరింత ఉత్తమ వైద్యం అందించేందుకు సీపాప్ మెషీన్లు, ఆటో అనలైజర్లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో చంటిపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బుర్రి రాంబాబు, డాక్టర్ విజయ భాస్కర్, డాక్టర్ గోపీచంద్, డాక్టర్ సూర్య సహా పీడియాట్రిక్స్ పీజీలు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం జీజీహెచ్, పీడియాట్రిక్స్ విభాగం తరఫున డాక్టర్ వంక రామకృష్ణ, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ చంద్రలను సత్కరించారు.

ఆర్ధ్రతతో ప్రార్థిస్తే కష్టాల నుంచి ఉపశమనం



పెనుగుదురు సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ధర్మప్రచారక్ రఘు

కరప: భగవంతుడిని డబ్బు ఉందన్న అహంకారం, ఆడంబరంతో కాకుండా ఆర్ధ్రతతో ప్రార్థిస్తే ఆయన కరుణాకటాక్షాలు లభించి, కష్టాలు తొలగుతాయని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ అన్నారు. మండలం పెనుగుదురులో శుక్రవారం జరిగిన సమరసత సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతినెలలో జరిగే సామూహిక పౌర్ణమి హారతి ద్వారా భగవంతుడికి స్వయంగా హారతి ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. భగవంతుడిని స్వచ్ఛమైన మనసుతో పూజించాలన్నారు. వచ్చేనెల ఐదో తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సమావేశానికి స్వచ్ఛందంగా పాల్గొని, విజయవంతం చేయాలని రఘు కోరారు. హైందవ శంఖారావ మండల కార్యనిర్వాహక్ పుట్టా వీరప్రసాద్ గాంధీ పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో లక్ష్య సాధన



విద్యార్థులను, తల్లిదండ్రులను సత్కరిస్తున్న శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత శ్యామ్

బోట్‌క్లబ్: కృషి, పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చునని శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్ అన్నారు. స్థానిక శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ రక్షణ బలగాల ఎస్ఎస్‌సీ 2024 ఫలితాల్లో విజయం సాధించిన విద్యార్థులను సత్కరించారు. అనుకున్న లక్ష్యాలు నెరవేరాలంటే ప్రతి ఒక్కరికీ ఒక లక్ష్యం అవసరమన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని ఒక పద్ధతి ప్రకారం చదువుకుంటే మంచి ఉద్యోగాలు సాధించవచ్చునన్నారు. నేటి యువత సెల్‌ఫోన్లకు బానిసలైపోయారని, దానిని వదిలి వారి లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో తమ వద్ద శిక్షణ పొందుతున్న 243 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లితండ్రులను సత్కరించారు. కార్యక్రమంలో అన్విత పబ్లికేషన్ చీఫ్ ఎడిటర్ శైలజ, ఫిజికల్ డైరెక్టర్లు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై నిరసన గళం

- వైఎస్సార్ సీపీ ర్యాలీ, ధర్నా
- ఎస్ఈ కార్యాలయం వద్ద ఆందోళన
- తరలి వచ్చిన వినియోగదారులు, నాయకులు, కార్యకర్తలు



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ కో-ఆర్డినేటర్ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



ఈపీ డీసీఎల్ ఎస్ఈ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి, కౌడా మాజీ చైర్‌పర్సన్ చంద్రకళా దీప్తి తదితరులు

కాకినాడ: పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ నిరసన గళం విప్పింది. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు కాకినాడలో సిటీ, రూరల్ నియోజకవర్గాల విద్యుత్ వినియోగదారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎస్ఈ కార్యాలయం ఎదుట కదం తొక్కారు. పార్టీ కార్యాలయం నుంచి వందలాదిగా ర్యాలీగా ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. దారి పొడవునా విద్యుత్ చార్జీలు ఉపసంహరించుకోవాలంటూ నినదించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నేతృత్వంలో పెద్ద ఎత్తున విద్యుత్ వినియోగదారులు, నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నినదించారు. ఎన్నికల అనంతరం ఇచ్చిన మాటను ఉల్లంఘించి విద్యుత్ చార్జీల మోత మోగించిన కూటమి సర్కార్ తీరును అడుగడుగునా ఎండగట్టారు. ర్యాలీ అనంతరం ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం ఎదుట నాయకులు, కార్యకర్తలు బైఠాయించారు. పెంచిన చార్జీలను తగ్గించేవరకు ప్రజల పక్షాన పోరాడతామని నినదించారు. ప్రభుత్వం మెడలు వంచైనా ప్రజలపై భారం లేకుండా చూస్తామని, ఇందుకోసం ఎలాంటి ఉద్యమానికైనా సిద్ధమంటూ పార్టీ నేతలకు ప్రజలు భరోసాగా నిలిచారు. రెండు నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున విద్యుత్ వినియోగదారులు, పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆందోళన అనంతరం ట్రాన్స్‌కో ఎస్ఈ ప్రసాద్‌ను కలిసి పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి శివకుమారి, అనుబంధ విభాగాల ప్రతినిధులు, అల్లి రాజబాబు, కృష్ణప్రియ, బాదం మధు, ఒమ్మి రఘురామ్, అబ్దుల్ బషీరుద్దీన్, జమ్మలమడక నాగమణి, మాకినీడి శేషకుమారి, కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, మాజీ మేయర్ పోలసపల్లి సరోజ, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు పసుపులేటి వెంకటలక్ష్మి, బెండా విష్ణుమూర్తి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా సంపద సృష్టి

మండిపడ్డ ద్వారంపూడి

అధికారాన్ని కట్టబెడితే ఎన్నో సంక్షేమ ఫలాలు అందిస్తామని తప్పుడు వాగ్దానాలు చేసి, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కార్ ఏ ఒక్క హామీని అమలు చేయకపోగా, ప్రజల నడ్డి విరిచిందని వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ కో-ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. విద్యుత్ చార్జీలు పెంపును నిరసిస్తూ చేపట్టిన పోరుబాటులో విద్యుత్ వినియోగదారులు, పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ తాజాగా 15 వేల కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని ప్రజలపై మోపారని, ఇదేనా సంపద సృష్టి అని ద్వారంపూడి నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోక పోగా తన వైఫల్యాలన్నింటికీ గత ప్రభుత్వాన్నే నిందించడం చంద్రబాబు ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. అమ్మ ఒడి, నిరుద్యోగ భృతి, సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పుడు మరోసారి ప్రజలను పూర్తిగా దగా చేశారని విమర్శించారు. 40 ఏళ్ళ రాజకీయ అనుభవంగా చెప్పుకునే చంద్రబాబు మాటలు నమ్మి అధికారాన్ని కట్టబెడితే ప్రజలను మోసం తప్పుడు ఆరోపణలు, విమర్శలతో అనుకూల మీడియా ద్వారా గత ప్రభుత్వంపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఇలాంటి అసమర్థ విధానాలపై ప్రజల పక్షాన నిలిచి పోరాడతామని ఆయన పేర్కొన్నారు.

నిర్ణీత గడువులో సర్వే పూర్తి చేయాలి

కమిషనర్ భావన



కాకినాడ సిటీ: ఎస్సీ కులగణన సర్వే నివేదిక తుది జాబితాను వచ్చే నెల పదో తేదీ నాటికి సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. శుక్రవారం కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయంలో పలు అంశాలపై జరిగిన సమీక్ష, శిక్షణ కార్యక్రమాల్లో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎస్సీ కులగణన సర్వేకు సంబంధించి ఎవరి నుంచైనా ఎటువంటి అభ్యంతరాలున్నా ఈనెల 31వ తేదీలోపు స్వీకరించాలని, ఆరో తేదీ నాటికి తుది జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. పదో తేదీ నాటికి తుది జాబితాను తుది జాబితాను ప్రచురించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, వీఆర్‌వోలు, వార్డు వసతులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎంఎస్ఎంఈ ఆన్‌లైన్ చేయడంపైనా కమిషనర్ పలు సూచనలిచ్చారు. మిస్సింగ్ సిటిజన్స్‌ను హౌస్‌హోల్డ్స్‌గా నమోదు చేసే విషయంపైనా చర్చించారు. ఈ మూడు సర్వేల విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత గడువులోపు ఈ సర్వేలు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమలో నగరపాలక సంస్థ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ తదితరులు పాల్గొన్నారు.

వరాహావతారంలో వేణుగోపాలుడు

బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాలు, రజిత అలంకార ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవాలయం వీధిలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి శుక్రవారం వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులు దాతల సహకారంతో ప్రసాదం పంపిణీ చేశారు.

విద్యార్థులు ఉత్తమ పరిశోధకులుగా రాణించాలి



లూయీ పాశ్చర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: విద్యార్థులు ఉత్తమ పరిశోధకులుగా రాణించాలని ఆదిత్య డిగ్రీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో మైక్రోబయాలజీ ఆధ్వర్యంలో ఈవెంట్ మైక్రోఫీస్టా-2024 శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ సూక్ష్మజీవశాస్త్ర వ్యవస్థాపకులు జీవ శాస్త్రవేత్త లూయిపాశ్చర్ 203వ జయంతి సందర్భంగా మైక్రోఫీస్టా నిర్వహించామని, వ్యాధులకు కారణమైన సూక్ష్మక్రిములను కనుగొని రోగ నివారణకు బాటలు వేసిన ప్రముఖ ఫ్రెంచి జీవశాస్త్రవేత్త లూయి పాశ్చర్ అన్నారు. సైన్స్ విద్యార్థులు అత్యాధునిక పరికరాలతో కూడా ల్యాబ్‌లో పరిశోధనలు చేసి కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన మ్యాగ్‌జైన్ రూపొందించారు. ఈ కార్యక్రమంలో నన్నయ వర్సిటీ డీన్ మట్టారెడ్డి, అధ్యాపకులు అనిల్, బి.శ్రీను, నరసింహమూర్తి పాల్గొన్నారు.

స్టేషన్లలో సివిల్ సెటిల్‌మెంట్లు వద్దు

ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణపై ఎటువంటి రాజీ పడొద్దని సూచించారు. రహదారి భద్రతపై పూర్తి స్థాయి నియంత్రణతో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. గంజాయి నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నామని, సత్ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. మహిళలు, బాలల భద్రతపై ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. డ్రోన్ల ద్వారా శివారు ప్రాంతాల్లో భద్రతను పర్యవేక్షించాలన్నారు. స్పందనకు వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. పలు స్టేషన్లలో కొందరు పోలీస్ అధికారులు సివిల్ సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారన్న సమాచారం అందుతోందని అదే జరిగితే సదరు అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత రాష్ట్రమే లక్ష్యం



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, తదితరులు



మండల పరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, తదితరులు

- ఐసీడీఎస్ పీడీ ప్రవీణ

కాకినాడ రూరల్: బాల్య వివాహ రహిత రాష్ట్రం కోసం శ్రమిద్దామని ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు తదితరులు పేర్కొన్నారు. కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006, కిశోరి వికాసం తదితర అంశాలపై ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, తదితరులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహ రహిత రాష్ట్రం కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కిశోరి వికాసం, అమలు తదితర అంశాలపై కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీడీపీఓ వై.లక్ష్మి వివరించారు. ఐసీడీఎస్ పీడీ ప్రవీణ మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్ష ఉండరాదన్నారు. ఆడ పిల్లలకు చదువులతో పాటు వారి కాళ్లపై వారు ఆధారపడి జీవించేలా తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించాలన్నారు. బాల్య వివాహాలు మంచిది కాదని, దీనిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు అమలులో ఉన్న చట్టాలు వాటి ద్వారా పడే శిక్షల గురించి వివరించారు. జిల్లా చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు బాలికలపై వేధింపులు, పోక్సో చట్టం, వ్యక్తిగత భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈఓ పీఆర్‌డీ ఎంఎస్ఆర్ ఆంజనేయులు, ఎంఈఓ ఏసుదాసు, వైద్యాధికారి మాధవి, లక్ష్మీ ప్రకాష్, మల్లేశ్వరి, మహిళా ఎస్సై లలితాదేవి, తదితరులు తమ సందేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మశ్రీ, మార్తమ్మ, సింహచలం తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధం, కాలుష్య నివారణకు చర్యలు

కాకినాడ రూరల్: మండల పరిధిలోని సూర్యారావుపేట, వాకలపూడి తదితర ప్రాంతాల్లో కాలుష్య నియంత్రణ అధికారులు పర్యటించారు. ఆయిల్ రిఫైనరీల నుంచి వస్తున్న దుర్గంధం, బూడిదతో పరిసర గ్రామాల ప్రజలకు గుండె, ఉదర కోశ వ్యాధులు బారిన పడుతున్నారనే ఫిర్యాదుపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించారు. కాకినాడకు చెందిన వినియోగదారుల హక్కులు పరిరక్షణ సొసైటీ చైర్మన్, జర్నలిస్టు ఎంవీఆర్ ఫణీంద్ర ఇటీవల ముఖ్యమంత్రికి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు స్పందించి కాలుష్య, దుర్గంధ కారక పరిశ్రమల గుర్తింపు చేట్టారు. వాకలపూడిలోని ఒక పరిశ్రమ నుంచి దుర్గంధం వస్తోందని గుర్తించారు. దుర్గంధానికి కారణమైన పరిశ్రమలో తాత్కాలికంగా నివారణ చర్యలు చేపట్టారు. ఫిర్యాదుదారుడు ఫణీంద్ర వద్దకు పొల్యూషన్ శాఖ ఏఈ రామచంద్రమూర్తి శుక్రవారం వెళ్లి దుర్గంధం, బూడిద వెదజల్లుతున్న పరిశ్రమలను గుర్తించామని, దుర్గంధం వ్యాపిస్తున్న పైప్‌ను తొలగించామని, విశాఖలోని ఉన్నతాధికారులకు నివేదిక పంపామని తెలియజేశారు. దీనిపై ఫణీంద్ర స్పందిస్తూ తమ సొసైటీ దృష్టికి సమస్యను బాధిత ప్రజలు తీసుకురావడంతో సీఎంకు గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేశానని, సమస్యను తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా పరిష్కరించాలని కోరామన్నారు.

మాతా, శిశు మరణాలను నివారించాలి

కాకినాడ సిటీ: మాతా, శిశు మరణాల నివారణకు మరింత మెరుగైన ప్రామాణిక వైద్య విధానాలు పాటించాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి వైద్యాధికారులను ఆదేశించారు. పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు, మాతా, శిశు మరణాల నివారణ అంశాలపై కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి కమిటీల సమావేశాలకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గడచిన రెండో త్రైమాస కాలంలో ప్రసూతి సమయంలో జరిగిన 7 మాతా మరణాలు, 3 శిశు మరణాలకు కారణాలను విశ్లేషించాలని, అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులకు అవసరమైన ఎకో కార్డియోగ్రఫీ పరీక్షలు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయిలో అందుబాటులో లేనందున.. అత్యవసర సమయాల్లో దగ్గరలోని ప్రైవేటు డయాగ్నొస్టిక్ సెంటర్లలో ఆసుపత్రి నిధులతో చేయించేందుకు ఆమోదం తెలిపారు. నిబంధనలు పాటిస్తున్న 2 కొత్త అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లకు, ఒక ఏఆర్‌టీ క్లినిక్‌కు అనుమతులిచ్చారు. మరో రెండు స్కానింగ్ సెంటర్లలో యంత్రాలు, చిరునామా మార్పులను అంగీకరించారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జ.నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సృజనను వెలికితీసేందుకే ఆరేటర్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నారాయణ ఈ-చాంప్స్ ఆర్-డి హెడ్ అర్చన తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ): విద్యార్థుల్లో సృజన, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను వెలికి తీసేందుకు ఏటా ఆరేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నారాయణ స్కూల్స్ ఏజీఎం రాఘవేంద్రరావు తెలిపారు. స్థానిక లక్ష్మీనారాయణనగర్‌లో నారాయణ ఎస్‌సీఎస్ స్కూల్‌లో ఆరేటర్ సీజన్ 5 నిర్వహించారు. కార్యక్రమానికి నారాయణ ఎస్‌సీఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ కవిత అధ్యక్షత వహించారు. రాఘవేంద్రరావు ముఖ్య అతిథిగా, హైస్కూల్స్ ఆర్ - డి హెడ్ రవికుమార్, ఈ-చాంప్స్ ఆర్-డి హెడ్ అర్చన, ఈ-కిడ్స్ ఆర్-డి హెడ్ సుస్మిత విశిష్ట అతిథులుగా, నారాయణ స్కూల్స్ జోనల్ హెడ్స్ మూర్తి, తులసి, ప్రియ, సఫూరా, నారాయణ స్కూల్స్ డీజీఎం కృష్ణ, ప్రిన్సిపల్స్ షర్మిల, కవిత, రవి కిశోర్, విఠల్ గౌరవ అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐడియల్ కళాశాల ఆంగ్ల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమ్మయ్య దొర, మాత రాజేష్ జ్యూరీలుగా వ్యవహరించారు. నారాయణ ఎస్‌సీఎస్ స్కూల్, ఆర్ఆర్ పేట్, నారాయణ సీఓ, ఏఎస్ఎన్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వారి ప్రతిభను ప్రదర్శించారు. చిన్నారులు వారు ఎంచుకున్న పాత్రలకు జీవంపోసి చక్కటి ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో సాఫ్ట్ స్కిల్స్ హెడ్ రాధాకృష్ణ, మెంటార్లు యోగేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా సాఫ్ట్ స్కిల్స్ మెంటర్ పద్మలత వ్యవహరించారు

నైట్ షెల్టర్‌ను పరిశీలించిన న్యాయమూర్తి



నైట్ షెల్టర్ గదిని పరిశీలిస్తున్న మెజిస్ట్రేట్ శ్రీదేవి

కాకినాడ లీగల్: కాకినాడ మండల న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా స్థానిక రామారావుపేటలోని నైట్ షెల్టర్ హోంను మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి.శ్రీదేవి శుక్రవారం సందర్శించారు. హోమ్ పరిసర ప్రాంతాలు, రిజిస్టర్లను న్యాయమూర్తి పరిశీలించారు. ఈ నైట్ షెల్టర్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. వసతి కేంద్రానికి వచ్చిన వారితో మాట్లాడి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, అనవసర గొడవలకు వెళ్లడం వల్ల సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందని కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి.శ్రీదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక స్పెషల్ సబ్‌జైలును పరిశీలించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ శ్రీదేవి మాట్లాడుతూ ఎవరికైనా న్యాయవాదులను పెట్టుకునే స్తోమత లేకపోయినా తమ మండల న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనేక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు, డిప్యూటీ జైలర్ జోసఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి విద్యను అందించాలి



విద్యార్థులకు చాక్లెట్లు పంచుతున్న ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు

కాకినాడ రూరల్: మండలంలోని పండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరావు సందర్శించారు. ప్రతి గ్రామంలో బడి ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ పిల్లల భవిష్యత్తుకు గ్రామ పెద్దలు కానీ, నాయకులు కానీ మంచి విద్య అందేలా పనిచేయాలన్నారు. ఇటీవల విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి స్వదేశానికి వచ్చిన తర్వాత ఆయన పండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శించి విదేశీ విద్యలో విద్యార్థుల క్రమశిక్షణ, తదితర అంశాలపై పాఠశాల పిల్లలకు వివరించి విద్య ఔన్నత్యాన్ని వివరించారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే శాశ్వతమైన ఆస్తి విద్యేనని పిల్లలకు తెలిపారు. తాము చదువుతున్న పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తెచ్చేలా చదువుకోవాలని పిల్లలను కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న అంజు ఆస్పత్రి వైద్యులు

కాకినాడ రూరల్: స్థానిక వాకలపూడి పంచాయతీలోని ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ (ఉమా మనో వికాస కేంద్రం)లో దృష్టి, వినికిడి సమస్య ఉన్నవారికి వైద్య పరీక్షలను సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని అజీమ్ ప్రేమ్ జీ సహాయ సహకారాలతో బహుళ వైకల్యం గల దివ్యాంగులకు, బధిర, అంధత్వం గలవారికి అంజు కంటి రక్షణ వైద్యశాల, గైగోలుపాడు నుంచి వైద్యుల బృందం హాజరై దాదాపు 90 మందికి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ షార్మిన్ పిల్లలందరికీ కంటి పరీక్షలు చేసి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చి, సహాయ పరికరాలు, మందులు ఇచ్చారు. దీనితో పాటుగా వినికిడి సమస్య ఉన్న దివ్యాంగులు 35 మందికి పరీక్షలు చేసి శ్రవణ యంత్రాలను జిల్లా దివ్యాంగుల పునరావాస కార్యక్రమం నుంచి అందజేస్తామన్నారు. పది మండలాల్లో 380 మందికి విద్య, వైద్య, శిక్షణ, జీవనోపాధులు, సాధికారిత వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నమని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో భాగంగా అంజు కంటి రక్షణ వైద్యశాల, గైగోలుపాడు నుంచి వైద్య బృందం చిట్టిబాబు, కె.సుధ, ఆర్.దేవి, ఎ.ఐశ్వర్య, మహేష్, ప్రదీప్, ఆడియోలజిస్టు విజయలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎన్ రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ కె.నారాయణరెడ్డి, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్ఏ నాయుడు సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

స్పెషల్ సబ్‌జైళ్ల రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా సబ్‌జైళ్ల అధికారి ఎల్.రంగస్వామి, సూపరింటెండెంట్ వీరబాబు

కాకినాడ లీగల్: కాకినాడ స్పెషల్ సబ్‌జైల్‌ను వార్షిక తనిఖీలో భాగంగా జిల్లా సబ్‌జైళ్ల అధికారి ఎల్.రంగస్వామి శుక్రవారం రికార్డులు పరిశీలించారు. సబ్‌జైలులో ముద్దాయిలు గదులను పరిశీలించారు. వారి సమస్యలు, వసతులు, భోజనం ఎలా ఉంది తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా న్యాయవాదులను పెట్టుకునే స్తోమత లేకపోతే మండల న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తనిఖీలో భాగంగా స్పెషల్ సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు, డిప్యూటీ జైలర్ జోసఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ జీవితాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అడబాల తదితరులు

బోట్‌క్లబ్: ఆర్థిక సంస్కర్త దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్ జీవితాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని నగర పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. మన్మోహన్ సంతాప సభ శుక్రవారం పౌర సంక్షేమ సంఘం భవనంలో నిర్వహించారు. సమాచార హక్కు చట్టాన్ని అందించారని, నిబద్ధత కల్గిన లౌకిక ప్రజాసామ్యవాదిగా భిన్నత్వంలో ఏకత్వ భావాన్ని ఆచరించిన ఆదర్శమూర్తిగా మన్మోహన్ సింగ్ పేరు గడించారన్నారు. అంతర్జాతీయ సమాజం మెచ్చిన రీతిలో అత్యుత్తమ ఆర్థిక వేత్తగా పదేళ్లపాటు ప్రధానమంత్రిగా పనిచేసి మచ్చలేని పాలన అందించారన్నారు.

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో దేశ మాజీ ప్రధాని, ప్రఖ్యాత ఆర్థిక వేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ల జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణ రాజు మాట్లాడుతూ అస్తవ్యస్తంగా ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన గొప్ప ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ అన్నారు. ఆర్థికవేత్తగా ప్రధానిగా దేశానికి గొప్ప సేవచేశారని అన్నారు. కార్యక్రమంలో చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, కె.సూర్య ప్రకాష్ ఇతరులు పాల్గొన్నారు.